క్లుప్తంగా

ప్రశాంతతను దెబ్బతీయవద్దు



నాయకులకు కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

పోలాకి: ఎన్నికల ఫలితాల సమయంలో గ్రామాల్లో ప్రశాంతతను దెబ్బతీయొద్దని రాజకీయ పార్టీల నాయకులకు పోలీసులు హితబోధ చేశారు. సీఐ ప్రసాద్, ఎస్ఐ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో పోలాకి పోలీస్‌స్టేషన్‌లో రెండురోజులుగా గ్రామాలవారీగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవల ఎన్నికలరోజు అక్కడక్కడ జరిగిన ఘర్షణలు, తరువాత జరుగుతున్న వివాదాలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటికే కొన్నిగ్రామాల్లో, కొంతమంది వ్యక్తులపై నిఘావేసి ఉంచామని వారిప్రమేయంతో ఎలాంటి వివాదాలు, ఘర్షణలు జరిగినా రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు.

అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు



కాటాలను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజారమేష్

ఎల్.ఎన్.పేట: వ్యాపారులు కొలతల్లో అక్రమాలకు పాల్పడితే వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తామని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ రాజా రమేష్ అన్నారు. మండల కేంద్రం ఎల్.ఎన్.పేటలో తూనికలు, కొలతల విభాగం ఆధ్వర్యంలో కాటాలకు గురువారం సీళ్లను వేశారు. ప్రతీ వ్యాపారి విధిగా కొలత పాత్రలకు సీళ్లు వేయించుకోవాలన్నారు. ఆకస్మిక తనిఖీలు చేసే సమయంలో పట్టుబడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలుదారునికి సరైన కొలతలతో విక్రయాలు జరపాలని సూచించారు.

ఎంఆర్సీకి చేరిన నోట్ పుస్తకాలు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

సారవకోట: మండల కేంద్రంలోని ఎంఆర్సీకి గురువారం 19,796 నోట్ పుస్తకాలు చేరినట్లు ఎంఈవో ఎంవీ రమణ తెలిపారు. మండలంలోని 84 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు వీటిని అందజేస్తామన్నారు. నోట్ పుస్తకాలను స్థానిక గొడౌన్‌లో భద్రపర్చారు. ఎంఈవో-2 భూలక్ష్మి, సీఆర్పీలు వసంత, షణ్ముఖరావు, దివ్యలున్నారు.

రెండు కేంద్రాల్లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో పరీక్ష సామగ్రిని సిద్ధం చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు రెండు కేంద్రాలు కేటాయించారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలను, సెకెండ్ ఇయర్ విద్యార్థులకు స్థానిక సంపత్ సాయి జూనియర్ కళాశాలను కేంద్రాలుగా మంజూరు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 426 మంది, సంపత్ సాయి జూనియర్ కళాశాల కేంద్రంలో 2,978 మంది పరీక్ష రాస్తున్నారు. కాగా ఈమేరకు ఏర్పాట్లు చేశారు. మొదటి రోజున ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 112 మంది, సంపత్ సాయి జూనియర్ కళాశాల్లో 180 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

సరుబుజ్జిలి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.రత్నం తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

గురు దత్తాత్రేయునికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవ స్వామి దేవాలయంలో గురు దత్తాత్రేయ స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష గురూజీ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేసి అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

● క్రికెట్‌లో శిక్షణ



పాతపట్నంలోని మహేంద్రడిగ్రీ కళాశాల మైదానంలో వేసవి క్రికెట్ క్రీడా శిక్షణ శిబిరాన్ని జిల్లా స్పోర్ట్స్ అథారటీ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పీడీ శేఖర్‌బాబు మాట్లాడుతూ.. క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తోందన్నారు. ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణిస్తే కెరీర్ బాగుంటుందన్నారు. శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

-పాతపట్నం

● ప్రమాద మలుపు!



బూర్జ మండలం మదనాపురం- సరుబుజ్జిలి రహదారిలో సీఎస్‌పీ రోడ్డుపై దుర్గగుడి జంక్షన్ ప్రధాన రహదారిలో ఉన్న మలుపు ప్రమాదాలను ఆహ్వానించేలా ఉంది. ఈ రహదారిలో ఉన్న రెండు మలుపులు వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఇక్కడ స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా దట్టంగా ఉన్న మొక్కలను తొలించాలని కోరుతున్నారు.

-బూర్జ

● గ్రామాల్లో సర్వే



దివ్యాంగు చిన్నారుల గుర్తింపు కోసం 40 రోజులు పాటు ప్రత్యేక సర్వే చేస్తున్నట్టు ఎంఈవో కె.శ్రీనివాస రావు తెలిపారు. సరుబుజ్జిలి గ్రామంలో గురువారం జరుగుతున్న దివ్యాంగ పిల్లల గుర్తింపు ప్రక్రియను పరిశీలించారు. సర్వేలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ బెండి సాయిరాం, ఐఈడీ ఉపాధ్యాయులు ఢిల్లేశ్వరరావు, అలేఖ్య, సీఆర్ఎంటీ బెండి చిన్నారావు పాల్గొన్నారు.

-సరుబుజ్జిలి

పరీక్ష కేంద్రం మార్చాలని విజ్ఞప్తి



మాట్లాడుతున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు

నరసన్నపేట: జంబ్లింగ్ పద్ధతిలో జరిగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల కోసం కేంద్రాలను ఏర్పాటు చేయడంలో అవకతవకలు జరిగాయని, నరసన్నపేటలో ఓ ప్రైవేటు కళాశాలలో కేటాయించిన సెంటర్‌ను మార్చాలని ప్రైవేటు కళాశాల యాజమాన్య ప్రతినిధులు డిమాండ్ చేశారు. నరసన్నపేటలో మంజూరు చేసిన రెండు సెంటర్లలో సంపత్‌సాయి కళాశాలకు సెకెండ్ ఇయర్ విద్యార్థులు పరీక్ష రాసేందుకు అవకాశం ఇవ్వడం శోచనీయమన్నారు. స్థానిక ప్రైవేటు జూనియర్ కళాశాలల యజమానులు రంగరావు, చిన్నబాబు, టి.జగదీశ్వరరావు, రమణమూర్తి గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. సంపత్ సాయి కేంద్రాన్ని మార్చాలన్నారు. ఇదే కళాశాలలో చదివి తప్పిన విద్యార్థులు ఇప్పుడు అక్కడే పరీక్షలు రాస్తున్నారని.. ఇలా ఎప్పుడూ జరగలేదన్నారు. ఈమేరకు జిల్లా కలెక్టర్‌కు, ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. అదే కళాశాలలో చదివిన విద్యార్థులు అక్కడే పరీక్షలు రాస్తే వారికి ప్రయోజనం కలుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. ఇది జంబ్లింగ్ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. సెల్ఫ్ సెంటర్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థుల హాల్ టిక్కెట్లను విలేకర్లకు చూపించారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



పాతపట్నంలో సర్వే చేస్తున్న సిబ్బంది

పాతపట్నం: ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కోసం సర్వే చేస్తున్నామని ఎంఈవో -2 సీహెచ్ తిరుమలరావు గురువారం తెలిపారు. మండల కేంద్రం పాతపట్నంలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. భవిత పాఠశాలలో నిర్వహించే సేవలపై అవగాహన కల్పిస్తూ మండలంలోని అన్నిగ్రామాల్లో సర్వే చేస్తున్నట్లు సహిత ఉపాధ్యాయిని సుధారాణి తెలిపారు. బడిలో చేరని 18 ఏళ్ల లోపు సిడబ్ల్యూస్ఎన్ పిల్లలను గుర్తించేందుకు ఇంటింటా వెళ్లి సర్వే చేస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలు ఉంటే భవిత కేంద్రానికి ఆయా గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా సమాచారం అందించాలని కోరారు.

పీఎం జన్మాన్ పథకంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం శ్రీరామచంద్రమూర్తి

హిరమండలం: ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ యోజన (పీఎం జన్మాన్)పై అవగాహన కలిగి ఉండాలని సీతంపేట ఐటీడీఏ టీఎంపియూ ఫైనాన్స్ ఏపీఎం సుబ్బయ్య నాయుడు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీఎం వి.శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో వీవోఏలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఉన్న ఏడు విద్యావికాస్ కేంద్రాల్లోని సభ్యులకు పీఎం జన్మాన్ పథకం అవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. గిరిజన మంత్రిత్వశాఖ, ఆధ్వర్యంలో షెడ్యూల్ తెగల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు పేర్కొన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనదిశగా పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎల్‌సీ శ్రీనివాసరావు, స్త్రీనిధి మేనేజర్ సాయిరాం, సీసీలు అసిరయ్య, అప్పన్న, శ్రీదేవి, జయంతి, సుజాత, అకౌంటెంట్ బేబీ ఉన్నారు.

పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి అన్నారు. గురువారం నైరా వ్యవసాయ కళాశాల 35వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయ సాధనకు పిల్లలు కృషి చేయాలన్నారు. అనంతరం కళాశాలకు సంబంధించిన సూర్య మ్యాగ్‌జైన్‌ను ప్రత్యేకాధికారి ఏఎస్ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు చిన్నంనాయుడు, సూర్య, సూర్యనారాయణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లికి నాదస్వర అర్చన



నాదస్వర కచేరి ప్రదర్శన



ఘటాలతో ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో జరుగుతున్న ముత్యాలమ్మతల్లి పండగల సందర్భంగా గురువారం నాదస్వర అర్చన ఘనంగా జరిగింది. 16మంది డోలు, సన్నాయి వాద్యకారులు భక్తి గీతాలాపనలు, కీర్తనలు ఆలపించారు. అనంతరం ముత్యాలమ్మతల్లి ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఇంటి వద్దకు వచ్చిన ఘటాలకు భక్తులు పూజలు చేశారు.

బీమా పరిహారం అందజేత



దేవికి చెక్కు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచంద్రి గ్రామానికి చెందిన పొదిలాపు భాస్కరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈయన మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకులో అకౌంట్‌తోపాటు ప్రమాద బీమా పాలసీ కలిగి ఉన్నారు. దీంతో ఆయనకు రూ.20 లక్షల బీమా మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును బ్యాంకు రీజనల్ మేనేజర్ కె.అర్జునరావు మృతుని భార్య పొదిలాపు దేవికి గురువారం అందజేశారు. బ్యాంకు సేవలను గ్రామీణ ప్రజల వద్దకు తీసుకుని వచ్చే విధంగా బ్యాంకు మిత్రలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ ఒక్కరు బ్యాంకు మిత్ర సేవలను వినియోగించుకోవటంతో పాటు బ్యాంకు ఖాతా కలిగిన ప్రతీ ఒక్కరు ప్రమాద బీమా సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీజీవీ బ్యాంకు బిజినెస్ ఎస్ఎం డి. ప్రవీణ్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ సందీప్, ఫీల్డ్ ఆఫీసర్ హేమలక్ష్మి, క్యాషియర్ ప్రతాప్, నోడల్ అధికారి వాసు, ఎస్‌బీఐ జనరల్ బీడీఎం వినీల్, రావిచంద్రి బ్యాంకు మిత్ర పునీత్ పాల్గొన్నారు.

వేడుకల రాధాగోవిందుల నౌకావిహార యాత్ర



నౌకా విహార యాత్ర సేవలో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి వద్ద నాగావళి నదీ తీరం, హరేకృష్ణా హిల్స్‌లోని ఇస్కాన్ జగన్నాథ్, భలదేవ్, సుభద్రమాయ్ మందిరంలో గురువారం సాయంత్రం రాధాగోవిందుల నౌకావిహార యాత్ర సేవ ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారు విహరించిన నౌకను లాగి ఆయన ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో మందిర నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా పూర్ణాహుతి



పూర్ణాహుతి సామగ్రితో అర్చక బృందం

గార: శ్రీకూర్మనాధుని కల్యాణోత్సవంలో భాగంగా వైశాఖ పూర్ణిమ పురస్కరించుకొని గురువారం సాయంత్రం పూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు ఆధ్వర్యంలో క్రతువు పూర్తి చేశారు. ఉదయం శ్వేతపుష్కరిణిలో ఉత్సవమూర్తులకు అవభృద స్నానం నిర్వహించారు. అనంతరం భక్తులు పవిత్ర స్నానాలచరించారు. కల్యాణోత్సవం చివరి కార్యక్రమంగా పూర్ణాహుతి జరిపించారు. ఆలయ ఈవో జి.గురునాధం, దాసుబాబు, శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, శ్రీనివాసాచార్యులు, కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న మెహర్‌ప్రభాకర్ బృందం

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, గోవిందరాజ స్వామి అఖండ బ్రహ్మోత్సవాలలో నగరానికి చెందిన నాట్య గురువు డి.మెహర్ ప్రభాకర్ బృందం భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. హనుమంతా దేవ నమో అనే నృత్యాంశంతో ముత్యాలపందిరి, కల్పవృక్ష వాహన సేవలో భాగంగా మాడవీధులలో నృత్య ప్రదర్శన చేసి నీరాజనం సమర్పించామని నిర్వాహకులు తెలిపారు.

ఎండి'నది'



తెలికిపెంట వద్ద ఎండిన వంశధార నది

సరుబుజ్జిలి: వంశధార నది చుక్కనీరులేక ఎండిపోయింది. తీర ప్రాంతాల గ్రామాలు తెలికిపెంట, అగ్రహారం, పాతపాడు, పర్వతాలపేట, యరగాం, పెదమాలపేటకు చెందిన ప్రజలు నిత్యావసరాలకు కూడా నీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు లేక చాలారోజులుగా నదిలోకి నీటిని విడుదల చేయలేదు.

దాతల ఔదార్యం

● మజ్జిగ పంపిణీతో తీరుతున్న దాహం



కాలేజీ రోడ్డు వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న సాయి భక్తులు



ఉమామహేశ్వరాలయం వద్ద చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న విజయకుమార్

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలోని మెయిన్ రోడ్డులో చల్లటి మజ్జిగ పంపిణీ చేస్తూ బాటచారులకు, వాహనదారులకు దాహాన్ని స్థానిక దాతలు తీర్చుతున్నారు. మార్పు విజయకుమార్ తన తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, ఈశ్వరరావుల జ్ఞాపకార్థం నెల రోజులుగా మజ్జిగను పాతబస్టాండ్‌లోని ఉమామహేశ్వరాలయం వద్ద పంపిణీ చేస్తున్నారు. అలాగే సత్యసాయి భక్తులు కాలేజీ రోడ్డు ఎదురుగా పంచాయతీ ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. దీంతో ఎండతీవ్రతతో ఇబ్బంది పడుతున్న బాటచారులకు చల్లటి మజ్జిగ వేసవి తాపాన్ని తగ్గిస్తుంది. కాగా మార్పు విజయ్ గడిచిన మూడు సంవత్సరాలుగా వేసవి రెండు నెలల్లో తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. వీరి సేవా కార్యక్రమాలను స్థానికులు అభినందిస్తున్నారు.

27న అమరవీరుల స్మారక సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విప్లవ పార్టీ నాయకులు

పలాస: మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఈ నెల 27న సాయంత్రం 5గంటలకు జరుగనున్న జిల్లా అమరవీరుల స్మారక సభను విజయవంతం చేయాలని వివిధ విప్లవ సంఘాల, పార్టీల నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. అమరవీరుల స్మారక మందిరం వద్ద గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1969 మే 27న జిల్లాలో మొదటి సారిగా జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆనాటి సి.పి.ఐ.ఎం.ఎల్ రాష్ట్ర నాయకులు పంచాది కృష్ణమూర్తితో పాటు ఏడుగురు విప్లవకారులు మృతిచెందారని గుర్తు చేశారు. నాటి శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో 360 మంది బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా మరణించారని పేర్కొన్నారు. నాటి అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని ప్రజాపోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సి.పి.ఐ.ఎం.ఎల్ లిబరేషన్ సీనియర్ నాయకుడు మద్దిల మల్లేశ్వరరావు, తామాడ సన్యాసిరావు, సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, పోతనపల్లి మల్లేశ్వరరావు, మద్దిల రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు



బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రరూపేన సిరిజ్యోతి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రంపై దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్